క్లుప్తంగా

35 మంది రక్తదానం



రక్తదాతలను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథరెడ్డి

కోడుమూరు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కోడుమూరు మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పట్టణంలోని శ్రీరాములవారి దేవాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో దాదాపు 35 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, రమేష్‌నాయుడు, మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, మాసుంబాషా, రియల్టర్ మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ సమస్యలపై శిక్షణ

సి.బెళగల్: గ్రామాల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు చెవి, గొంతు, ముక్కు (ఈఎన్‌టీ) సమస్యల గుర్తింపుపై సి.బెళగల్ పీహెచ్‌సీలో శనివారం శిక్షణ ఇచ్చారు. ప్రజలకు సకాలంలో సేవలందించేందుకు ఆశా వర్కర్లకు ఈఎన్‌టీ జబ్బులపై శిక్షణ ఇవ్వడం జరిగిందని పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌రెడ్డి తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

పాణ్యం:చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాణ్యం ఆయుర్వేద వైద్యురాలు శ్రీదేవి అన్నారు. శనివారం పాణ్యం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయుర్వేద సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పకుండా ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పౌష్టిక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో క్విజ్ పోటీలు

గూడూరు: జాతీయ బాలికా వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం పట్టణంలోని కేజీబీవీలో విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి ఐసీడీఎస్ పీడీ కేఎల్ ఆర్కె కుమారి బహుమతులు అందించారు. అనంతరం ఆమె వ్యక్తిగత పరిశుభ్రత, సమ తుల్య ఆహారం గురించి బాలికలకు అవగాహన కల్పించారు.అంతకు ముందు పీడీ 1 వ నంబర్ అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఆమె వెంట కోడుమూరు ప్రాజెక్టు సీడీపీఓ వరలక్ష్మి దేవమ్మ, కేజీబీవీ సిబ్బంది, అంగన్ వాడీ కార్యకర్తలు ఉన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

సి.బెళగల్: జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం కింద గ్రామాల్లో చేస్తున్న భూ రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అన్నారు. శనివారు వీఆర్వోలు, గ్రామ సచివాలయ సర్వే సహాయకులు, వీఆర్‌ఏలతో భూ రీసర్వేపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూముల రీ సర్వేతో భవిష్యత్‌లో భూ వివాదాలు ఉండవన్నారు. మండల వ్యాప్తంగా 52,524.86 ఎకరాల భూములు ఉండగా ఇప్పటి వరకు 32,191 ఎకరాల్లో రీ సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు.

రేపు కొంగనపాడులో గడప గడపకు..

కల్లూరు: మండల పరిధిలోని కొంగనపాడు గ్రామంలో సోమవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీవీ రమణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై అనంతరం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు.

భవనాలు పూర్తి చేయాలి

గూడూరు రూరల్: గ్రామాల్లో ఆర్‌బీకే, సచివాలయ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మాధవీలత సూచించారు. కె.నాగలాపురంలోని ఆర్‌బీకే పనులను శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చనుగొండ్ల, పెంచికలపాడు, మునగాల, కె.నాగలాపురం, బూడిదపాడులో ఆర్‌బీకే, సచివాలయాల భవనాల పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. రానున్న రెండు నెలల్లో ఆయా నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని కాంట్రాక్టర్లకు ఆమె సూచించారు.

శాంతిరాంలో సెమినార్

పాణ్యం: భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్‌ఈపీ–2020ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం తెలిపారు. శనివారం మండల పరిధిలోని శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ ఇంజినీరింగ్ పాలసీలో భాగంగా వివిధ అంశాలపై సెమినార్ నిర్వహించారు.

వివాహిత అదృశ్యం

గడివేముల: గని గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన గాజుల సమీమ్ ఈ నెల18 వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు.దీంతో వివాహిత తండ్రి, ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన షేక్ శామీర్ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రారంభానికి వేళాయె!



కొంగనపాడులో ప్రారంభానికి సిద్ధమైన గ్రామ సచివాలయం



అన్ని హంగులతో ఆర్‌బీకే

కల్లూరు: ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలు స్థానికంగానే అందించాలని ప్రభుత్వం ఊరూరా గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా వాటికి పక్కా భవనాలు నిర్మిస్తోంది. తాజాగా మండలంలో చిన్నటేకూరు, పుసులూరు, తడకనపల్లె, బస్తిపాడు, బొల్లవరం, పెద్దపాడు గ్రామాల్లో చేపట్టిన సచివాలయ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. కొంగనపాడులో దాదాపు రూ. 60 లక్షలతో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే కేంద్రాన్ని ఈనెల 24న ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

రైతు నేస్తాలు



పంట పొలాల్లో రైతు నేస్తాలు సందడి చేస్తున్నాయి. రబీ పంటల సాగుకు రైతులు పొలాలను దుక్కి దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. తెల్లటి కొంగలు గుంపులు గుంపులుగా అక్కడికి చేరుకుని పొలాల్లో ఆహార అన్వేషణ సాగిస్తున్నాయి. శనివారం గడివేముల మండలం కరిమద్దెల గ్రామ సమీపంలో కనిపించిన దృశ్యమిది. –గడివేముల

మత్స్య ఉత్పత్తులను పెంచండి

● డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య

కర్నూలు (న్యూటౌన్): మత్స్య ఉత్పత్తులను భారీగా పెంచాలని డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య మత్స్యశాఖ అధికారులకు ఆదేశించారు. శనివారం కర్నూలు మండల సమాఖ్య సమావేశ మందిరంలో కోడుమూరు, ఓర్వకల్లు మండలాల ఏసీ, ఏపీఎంలకు, లబ్ధిదారులకు ఫిష్ ఆంధ్ర పథకంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి మండలంలో 10 చొప్పున ఫిష్ ఆంధ్ర రిటైల్ ఔట్‌లెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఇస్తున్నామన్నారు. పొదుపు మహిళలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫిష్ ఆంధ్ర రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా ఉపాధితో పాటు లాభాలు గడించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఫిషరీస్ డీడీ శ్యామల, ఏపీడీ శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఫిష్ ఆంధ్ర అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వెంకట సుబ్బయ్య

విద్యుత్ టారిఫ్‌పై ముగిసిన అభిప్రాయ సేకరణ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ టారిఫ్‌పై ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్‌సీ) చేపట్టిన విచారణ శనివారంతో ముగిసింది. విశాఖపట్నం నుంచి చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ చార్జీలు పెంచకూడదని, మెరుగైన సరఫరా అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి విన్నవించారు. వెంచర్లలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు నిబంధనలను సడలించాలని క్రెడయ్ ప్రతినిధి తారకేశ్వర్ కోరారు. ఇది తమ పరిధిలోని లేని అంశమని, సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ పేర్కొంది. కార్యక్రమంలో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు, కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి, ఈఈలు, ఏడీఈలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలి



భక్తి సమ్మేళనం స్మరణ సంచికను ఆవిష్కరిస్తున్న రామకృష్ణ మిషన్ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని రామకృష్ణ మిషన్ కడప కార్యదర్శి స్వామి భీతిహరానంద మహరాజ్ అన్నారు. రాష్ట్రస్థాయి భక్తి సమ్మేళనంలో భాగంగా రామకృష్ణ – వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కర్నూలు వీఆర్ కాలనీలో రెండో రోజు శనివారం స్మరణ సంచిక ఆవిష్కరించారు. అలాగే మహిళా సదస్సు నిర్వహించారు. రామకృష్ణ మిషన్ కడప కార్యదర్శి స్వామి భీతిహరానంద మహరాజ్, స్వామి సన్నివాసానంద, రామకృష్ణ మఠం రాజమహేంద్రవరం అధ్యక్షులు స్వామి వినిశ్చలానంద మహరాజ్, రామకృష్ణ మిషన్ తిరుపతి కార్యదర్శి, రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ (ఆర్‌వీబీపీపీ) రాయలసీమ అధ్యక్షులు స్వామి సుకృతానంద మహరాజ్, వారణాసి మఠం నందీశ్వరరానంద సందేశమిచ్చారు. రామకృష్ణ పరమ హంస, వివేకానంద, శారదామయి ప్రబోధనలు ప్రతి ఇంటికి చేరాలన్నారు. విలువలతో కూడిన జీవనం సాగించాలన్నారు. గుంటూరు శారదా మఠం ప్రవ్రాజిక ధర్మాత్మ ప్రాణ మాతాజీ, బోధమయ ప్రాణ మాతాజీ, డాక్టర్ లీల, పార్వతీ దేవిలు శారదమ్మ భావ సమాధులు, శారదా మాత – ఆధ్యాత్మిక జీవితం అనే అంశాలపై మహిళా సదస్సు నిర్వహించారు. కన్వీనర్ డాక్టర్ నాగ త్రిశూల పాణి, నిర్వాహణ కార్యదర్శి డాక్టర్ కేజీ శరత్ చంద్రబాబు, రామకృష్ణ సేవా సమితి నగర అధ్యక్షులు కేజీ గోవిందరెడ్డి, కర్నూలు కన్వీనర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

గడివేముల: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మధ్యాహ్నం విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ విజయసింహారెడ్డి వంట ఏజెన్సీ నిర్వాహకులకు హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు గోరుముద్దను అందించాలన్నారు. నాణ్యమైన కూరగాయలతో వంట చేయాలన్నారు. అలాగే తయారీ సమయంలో శుభ్రతను పాటించాలన్నారు.ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. అనంతరం స్థానిక సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని అర్హులందరికీ అందించాలని సూచించారు. గ్రామంలో జరుగుతున్న మొబైల్ ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు.



బిలకలగూడూరు ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

గోమాతకు పూజ

కోడుమూరు: ప్యాలకుర్తి గ్రామంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం శివస్వాములు గోమాతకు పూజలు చేశారు. నాలుగు రోజులుగా శివస్వాములు ఆలయంలో ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తిరుమల తిరుపతి హిందూ ధర్మం ప్రచారపరిషత్ కర్నూల్ జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉసేనయ్య భక్తులకు మహాభారతం, భగవద్గీత సారాంశాలను బోధించారు. కార్యక్రమంలో మల్లు వెంకటరామిరెడ్డి, గేరి బోయిన హనుమంతు, వెంగోట్ రంగన్న, రేపల్లే గోవిందు, మధు తదితరులు పాల్గొన్నారు.



గోమాతకు పూజలు చేస్తున్న శివస్వాములు

భోగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శైవక్షేత్రం భోగేశ్వరాలయంలో శనివారం అమవాస్య పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు శ్యాంసుందర్‌శర్మ స్వామికి ప్రత్యేక దూపదీప నైవేద్య కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ప్రతి రోజు భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఇదిలా ఉంటే దుర్వేశి గ్రామస్తులు శనివారం స్వామి నిత్యాన్నదాన పథకానికి 12 బస్తాల బియ్యంతో పాటు రూ.6 వేలు ఈఓకు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో భోగేశ్వరుడు

జగనన్నకు మరోసారి పట్టం కడదాం

● గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు: ప్రజా రంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా పట్టం కడదామని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని తూర్పు బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.....మరింత అభివృద్ధి జరగాలన్నా మరో సారి జగనన్నకు సీఎంగా అవకాశం ఇవ్వాలన్నారు. మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. సంక్షేమ పథకాలను గడప వద్దకే తెచ్చి ఇస్తున్నామన్నారు. దేశం లో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ జగనన్న మేలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, సచివాలయాల కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఏఈ నరసింహమూర్తి, మెప్మా టీఎంసీ సూర్యనారాయణ, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎస్‌ఏ జిలానీ, కౌన్సిలర్లు ఉరుకుందమ్మ, ఖలీలు, నంద కిషోర్, మద్ది, కిషోర్, సింగిల్ విండో డైరెక్టర్ సత్యాలు, పత్తి రంగడు, దండు శ్రీను, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కౌన్సిలర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

6 వ వార్డు కౌన్సిలర్ దస్తగిరి రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయ పడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ కౌన్సిలర్ దస్తగిరి ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాక్షించారు.

గోరంట్ల హంద్రీనది పరిశీలన

కోడుమూరు : గోరంట్ల హంద్రీనదిని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ శనివారం పరిశీలించారు. ఈనెల 24న రూ.24 కోట్ల వ్యయంతో కాజ్‌వే పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గోరంట్ల హంద్రీపై కాజ్‌వే నిర్మాణాన్ని గత పాలకులెవ్వరూ పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. ఎమ్మెల్యే వెంట పీఐయూ డీఈ చాడేశ్వరరావు, సర్పంచ్ బాలకృష్ణ,ఎంపీటీసీలు సద్దల రవి, కె.మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



హంద్రీనదిపై కాజ్‌వే నిర్మాణానికి శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బాలికా వారోత్సవాలను జయప్రదం చేద్దాం

కర్నూలు(సెంట్రల్): జనవరి 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే జాతీయ బాలికా వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో భేటీ పడావో భేటీ బచావో వాల్ పోస్టర్లను ఎంపీలు సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం, ఎమ్మిగనూరు, కోడుమూరు శాసన సభ్యులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, డాక్టర్ జె.సుధాకర్‌తో కలసి ఆయన ఆవిష్కరించారు. బాలికల హక్కులను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా బాలిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలన్నారు. ఆడపిల్లలను రక్షించుకోవడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బాలిక విద్య ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు, ఎంపీలు, ఎమ్మెల్యే

సర్వీసులు పెండింగ్‌లో ఉండరాదు

కర్నూలు (టౌన్): సచివాలయాలకు వచ్చే సర్వీసులు పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. శనివారం స్థానిక బి.క్యాంపులోని 56వ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలకు వచ్చే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వచ్చే అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఆదేశించారు.

సచివాలయాల పర్యవేక్షణకు అధికారుల కేటాయింపు

సి.బెళగల్: గ్రామ సచివాలయాలను మరింత మెరుగ్గా నిర్వహించేందుకు, ఉద్యోగులు, వలంటీర్ల సమన్వయం చేసేందుకు మండల స్థాయి అధికారులను కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో మొత్తం 18 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఇందులో తొమ్మిది గ్రామ సచివాలయాలకు ఎంపీడీఓ రాముడు, మరో తొమ్మిది సచివాలయాలకు తహసీల్దార్ శివశంకర్‌నాయక్‌ను పర్యవేక్షణ అధికారులుగా నియమించారు. కాగా ఎంపీడీఓ రాముడుకు కొత్తకోట -2 (ఈర్లదిన్నె), కొండాపురం, పోలకల్ - 2, సి.బెళగల్ -1, సి.బెళగల్ - 3 (చింతమానుపల్లె), బురాన్‌దొడ్డి, సంగాల, ఇనగండ్ల గ్రామ సచివాలయాలు, తహసీల్దార్‌కు పోలకల్ -1, పోలకల్ - 3, కొత్తకోట - 1, ముడుమాల, బ్రాహ్మణదొడ్డి, సి.బెళగల్ - 2, కంబదహాల్, బురాన్‌దొడ్డి - 2 (గొల్లలదొడ్డి) గ్రామ సచివాలయాలను కేటాయించారు. ఇకపై ఆయా గ్రామాల్లో సంక్షేమ పథకాల నిర్వహణ, ఉద్యోగులు, వలంటీర్ల పనితీరు, అభివృద్ధి పనుల నివేదికలు, పర్యవేక్షణను సంబంధిత అధికారులు చూస్తారు.

ఆలయ ప్రతిష్టను కాపాడాలి

ఓర్వకల్లు: ఆలయ ప్రతిష్ట దెబ్బతినకుండా విద్యుత్ టవర్లను నిర్మించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విద్యుత్ కాంట్రాక్టర్లకు సూచించారు. శనివారం మండలంలోని కొంతలపాడు గ్రామ శివారులో యాగంటీశ్వరస్వామి దేవస్థాన సమీపంలో జరుగుతున్న హై టెన్షన్ విద్యుత్ స్తంభాల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు, ఆలయాలకు ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఉప్పలపాడు గ్రామం నుంచి ఏపీఐఐసీ ఇండస్ట్రియల్‌కు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ టవర్లు ఆలయానికి అడ్డంగా నిర్మిస్తున్నారని గ్రామస్తులు ఎమ్మెల్యేకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన సందర్శించి సదరు కాంట్రాక్టర్లతో మాట్లాడారు.

నిర్మాణాలు వేగవంతం చేయండి

గూడూరు రూరల్: లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ జమ్మన్న సూచించారు. కె.నాగలాపురంలో గృహ నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు.

ల్యాబ్‌టెక్నీషియన్లకు శిక్షణ

కర్నూలు(హాస్పిటల్): మలేరియా విభాగంలో పని చేసే ల్యాబ్‌టెక్నీషియన్లకు హ్యాండ్స్ ఆన్ అనే శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాలకు అనుగుణంగా శనివారం నగరంలోని మెడిటేరియన్ ఫంక్షన్ హాలు సమీపంలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మొదటి బ్యాచ్‌లో 20 మంది ల్యాబ్‌టెక్నీషియన్లకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. మైక్రోస్కోపి, రిజిస్టర్స్, రికార్డ్స్, చార్ట్స్ ఎలా నిర్వహించాలనే విధానంపై వీరికి విపులంగా వివరించినట్లు పేర్కొన్నారు.

27న రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా సంస్థల క్రీడా ప్రాంగణంలో ఈనెల 27న కర్నూలు, నంద్యాల జిల్లాల అంతర్ పాఠశాలల రగ్బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రగ్బీ సంఘం జిల్లా అధ్యక్షులు గుడిపల్లి సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్నటు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు ప్రవేశ రుసుం రూ.10లు చెల్లించి నేరుగా పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 9393827585 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కోడుమూరు: క్రిష్ణగిరి మండలం చుంచు ఎర్రగుడి నుంచి చిట్యాల గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని శనివారం తెల్లవారుజామున ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్‌గౌడ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ స్వామినాథన్ దాడులు చేసి పట్టుకున్నారు. మొత్తం 36 బాక్సుల్లో 3,456 టెట్రా ప్యాకెట్లు ఉన్నట్లు వెల్లడించారు. కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న మాధవక్రిష్ణ, మద్దిలేటిలను అరెస్టు చేసి డోన్ ఎక్సైజ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు. గిరిబాబు అనే వ్యక్తిని కూడా ఈ కేసులో ముద్దాయిగా చేర్చి టాటా సఫారీ వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలియజేశారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సునీల్ కుమార్, సూర్యప్రకాష్, హనుమంతు, కరుణ, శంకర్‌నాయక్, బషీర్, నరసింహ, క్రిష్ణుడు, రాజు తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యం, నిందితులను చూపుతున్న అధికారులు

ఉపాధిలో కూలీల సంఖ్య పెంచాలి

కర్నూలు (న్యూటౌన్): జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. శనివారం కర్నూలు మండలం గార్గేయపురంలోని చెక్ డ్యాంలో పూడికతీత పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో రైతు మల్లయ్య పెంచుతున్న మునగ తోటను పరిశీలించారు. కేజీ మునగ రూ.150 నుంచి రూ.200 వరకు మార్కెట్‌లో ధర ఉందని రైతు వివరించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ ఉపాధిలో కూలీలకు దినసరి వేతనం రూ.257 పడేలా పని కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కర్నూలు మండల ఏపీఓ మహమ్మద్‌బాషా, గార్గేయపురం మాజీ సర్పంచ్ ఏసేపు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.



గార్గేయపురంలో పూడిక తీత పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి